క్లుప్తంగా

27న తిరుకల్యాణ మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరికొండపై ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9.45 గంటలకు 25వ తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కామిని వెంకట రామ ప్రసాద్ చౌదరి ఈ విషయాన్ని మంగళవారం ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితుడు కాళ్ళకూరి సూర్యశ్రీ (సూరిపండు), ఆలయ ప్రధాన అర్చకుడు నండూరి శ్రీకృష్ణ పరమాత్మ ఆధ్వర్యంలో కామిని వెంకటరామ ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతులతో కల్యాణం జరిపించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు భారతీయం సత్యవాణి ఆధ్యాత్మిక ప్రవచనం చెబుతారు.

24న సుకన్య సమృద్ధి మెగా మేళా

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న ప్రత్యేక సుకన్య సమృద్ధి యోజన మెగా మేళా నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం తపాలా డివిజనల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 0–10 ఏళ్ల లోపు బాలికలందరకీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ ఖాతాను కేవలం రూ.250తో తెరచి, ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 లక్షలు మించకుండా పొదుపు చేయవచ్చన్నారు. ఖాతాను ప్రారంభించిన తర్వాత 15 ఏళ్ల వరకూ నగదు జమ చేయాలని, ఖాతా 21 ఏళ్లకు మెచ్యూర్ అవుతుందన్నారు. ఆసక్తి కలవారు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



కాతేరులో సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు దాసరి శ్రీనివాస నగర్‌లోని ముంపు సమస్యను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం పరిశీలించారు. కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు తొలగింపునకు తక్షణమే చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం గ్రామంలో చెరువు గట్టుపై ఆక్రమణలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, బిక్కిన సాంబశివరావు, గంగిన నాని, పంచాయితీ కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి మెరుగైన ఉపాధి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాల సేవలు అందించేవారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మెరుగైన అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం సర్వీస్ ప్రొవైడర్ల మేళా నిర్వహించారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గ్లీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ల టెక్నీషియన్లు, బ్యూటీషియన్, సెలూన్ సర్వీసెస్ (పురుషులు, స్త్రీలు) మొదలైన సేవలందించే వారిని గుర్తించి, వారికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. అర్హత కలిగిన వారు తమ పేర్లను నగరపాలక సంస్థ మెప్మా విభాగంలో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వారి పేర్లను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో లింకు చేసి ప్రజలతో నేరుగా అనుసంధానం చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేనేజర్ అబ్దుల్ మాలిక్, మెప్మా అధికారి మంగాదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిల కోసం యూటీఎఫ్ వినతి



జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్ బకాయిల కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుకి జిల్లా కమిటీ వినతి పత్రం సమర్పించింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ నేతృత్వంలో నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలకు రోడ్ మ్యాప్ ఇవ్వాలని, డీఏలు, పీఆర్సీ ఏరియర్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ నగదు, సరెండర్ లీవులు, పీఎఫ్ లోన్లు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీగా ఉద్యమం చేయబడతామన్నారు.

గంధోత్సవం..ఐక్యతకు చిహ్నం

- నేడు దర్గా నిషానీలో గంధోత్సవం
- పూర్తయిన ఏర్పాట్లు
- 65 ఏళ్లుగా నిర్వహణ
- మతసామరస్యానికి ప్రతీక



విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న దర్గా నిషాని

సీటీఆర్ఐ: భిన్నత్వంలో ఏకత్వం మన దేశ గొప్పదనం. వివిధ మతాలు, అనేక జాతుల ప్రజలు ఉన్నా ఐకమత్యంతో కలిసికట్టుగా జీవిస్తారు. ముఖ్యంగా మత సామరస్యం మన భారతీయుల ప్రత్యేక లక్షణం. ఒకరి మతాలను మరొకరు గౌరవించుకుంటూ, వారి ఉత్సవాల్లో పాల్గొంటూ ముందుకు సాగుతారు. హిందూ దేవుళ్ల జాతరలు, ముస్లిం ఔలియాల ఉర్సులు, క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరగాల్సిందే. ఇదే కోవలోకి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని హజరత్ మహబూబ్ సుభానీ కరీముల్లా షా ఖాదరీ దర్గా నిషానిలో జరిగే గంధోత్సవం చేరుతుంది.

1952లో ఏర్పాటు

ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఈ దర్గా నిషానీలో బుధవారం గంధోత్సవాన్ని వైభవంగా జరపనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవంలో ముస్లింలతో పాటు హిందువులు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటారు. మత సామరస్యాన్ని చాటి చెబుతూ భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. ఈ దర్గా నిషానీని 1952లో నిర్మించారు. ప్రస్తుతం 65వ ఉర్సు గంధ మహోత్సవం జరుగుతుంది. ఔలియాలకు ముఖ్య గురువైన హజరత్ మహబూబ్ సుభానీ రహ్మతుల్లా అలైహి దర్గా ఇరాక్‌లో ఉంది. అక్కడ నుంచి పవిత్ర జెండాను తీసుకువచ్చి ఆర్ట్స్ కళాశాల వద్ద ఎదురుగా స్థాపించారు. అప్పటి నుంచి ఇరాక్‌లోని దర్గాలో ఏ విధమైన కార్యక్రమాలు జరుగుతాయో ఇక్కడ కూడా అదే విధంగా నిర్వహిస్తున్నారు.

వైభవంగా ఊరేగింపు

గంధోత్సవం రోజు బాబా వారికి తీసిన గంధాన్ని నగరంలో ఘనంగా ఊరేగిస్తారు. ఒంటెలు, ఫకీర్ల మేళా, బ్యాండుబాజాలు, గుర్రాలతో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. నెహ్రూ నగర్, రాజేంద్ర నగర్, వై.జంక్షన్ మీదుగా తిరిగి దర్గా నిషానీ వద్దకు చేరుకుంటుంది. జెండాలతో



ఊరేగింపునకు తీసుకువచ్చిన ఒంటెలు

ముస్లింలు, హిందువులు ఈ ఊరేగింపులో పాల్గొనడం విశేషం. అంతే కాకుండా గంధం తీసుకోవడానికి అన్ని మతాల వారు ప్రాధాన్యత ఇస్తారు. ఈ సందర్భంగా భోజన విందులో సుమారు పదివేల మందికి పైగా హాజరవుతారు.

అందరికీ బాబా ఆశీస్సులు



నా ఏడో సంవత్సరం నుంచి బాబా గంధోత్సవంలో పాల్గొంటున్నాను. ముందుగా మా అమ్మగారు ఈ కార్యక్రమం నిర్వహించేవారు. ఆమె తరువాత నేను బాధ్యత తీసుకున్నాను. ఈ ఉత్సవంలో ముస్లింలతో పాటు అన్ని మతాల ప్రజలు పాల్గొని బాబావారి ఆశీసులు పొందుతారు.

– సయ్యద్ హజిర్న్ అమీరున్నీసా, దర్గా నిషానీ

వైభవంగా నిర్వహిస్తాం



గంధోత్సవాన్ని ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తాం. ఒంటెలు, గుర్రాలు, మేళతాళాలతో గంధాన్ని నగరంలో ఊరేగించి, దర్గా వద్దకు తీసుకువస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాన్య ప్రజలు ఈ గంధం తీసుకోవడం పవిత్రంగా భావిస్తారు.

– సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, దర్గా నిషానీ అధ్యక్షుడు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది మంగళవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ, వాహనదార్ల రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. హెల్మెట్ ప్రాధాన్యాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. మద్యం తాగి, అతి వేగంగా, రాంగ్ రూట్‌లో, సెల్ ఫోన్ మాట్లాడుతూ, వాహనాలు నడపరాదని అన్నారు. ట్రిపుల్ రైడింగ్ తగదన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను తరలించరాదన్నారు. రహదారి ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, తన కోసం కుటుంబం ఎదురు చూస్తుందనే విషయాన్ని జ్ఞప్తిలో ఉంచుకుంటూ, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.అర్జున్, చెంచిరెడ్డి, స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీ బి.రామకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఇతర డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వైభవంగా గొంతేలమ్మ జాతరోత్సవం



మాజీ మంత్రి వేణుకు బహుమతి అందజేస్తున్న లక్ష్మీ లేబర్ కాంట్రాక్టర్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం గ్రామ దేవత గొంతేలమ్మ జాతరోత్సవం వైభవంగా జరుగుతోంది. రెండో రోజు మంగళవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొప్పెల్ల కనక మహాలక్ష్మి ఈవెంట్స్ ప్రోగ్రామ్ వారి కోయ డ్యాన్స్, జగ్గంపేట ప్రసన్న సాయిదుర్గ కళానిలయం వారి కోలాటం, గాజువాక బాలు రైడర్స్ డ్యాన్స్ హంగామా ఆహూతులను అలరించాయి. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ గొంతేలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనను లక్ష్మి లేబర్ కాంట్రాక్టర్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించి, బహుమతి అందజేశారు. మూడో రోజైన బుధవారం కోబ్రా డ్యాన్స్, కేరళ వాయిద్యాలు, రాత్రి ఏడు గంటలకు గారడీ నృత్యాలు ఏర్పాటు చేశారు.



గొంతేలమ్మ జాతరలో ఆకట్టుకున్న కోలాటం

నేరస్తుల వివరాలు అప్‌డేట్ చేయాలి

- సైబర్, రోడ్డు, మహిళా భద్రతపై దృష్టి పెట్టాలి
- ఎస్పీ నరసింహ కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు : నేరస్తుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు కచ్చితంగా అప్‌డేట్ చేయాలని, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మిస్సింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ తదితర కేసులపై ఎస్పీ ఆరా తీశారు. బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రిఫ్ రాఫ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని స్పష్టం చేశారు. 112 నంబర్‌కు వచ్చే కాల్స్‌కు తక్షణమే స్పందించి, వెంటనే నేర స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. సారా, గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, దాడులు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై స్థానికుల నుంచి సమాచారం తీసుకుని దాడులు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సత్వరమే ఆచూకీ కనుగొని, కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల ముందస్తు చర్యలూ తీసుకోవాలన్నారు. సైబర్ భద్రత, రోడ్డు భద్రత, మహిళా భద్రత, ఇంటి భద్రతపై ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా చిరంజీవి పార్కు పునర్నిర్మాణం



పార్కు పనులను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: కంబాల చెరువు సమీపంలోని చిరంజీవి పార్కును ఆహ్లాదకరంగా ఉండేలా పునర్నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జనసేన సిటీ అధ్యక్షుడు వై.శ్రీను, జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ తదితర కూటమి నాయకులతో కలిసి మంగళవారం ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ మన్యం పులి అల్లూరి సీతారామరాజుతో పాటు ఆ ఉద్యమంలో ఆయనతో పాల్గొన్న 11 మంది వీరుల విగ్రహాలను రూ. 50 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామని, పార్కు సుందరీకరణ కోసం రూ.70 లక్షలు వెచ్చించినట్టు తెలిపారు. మదర్ థెరిస్సా విగ్రహం ఈ ఇదే పార్కును గతంలో కేంద్ర మాజీ మంత్రి, మెగా స్టార్ చిరంజీవి ప్రారంభించారని, ప్రస్తుతం జరుగుతున్న పార్కు పనులు పూర్తయిన తరువాత ఫిబ్రవరి రెండో వారంలో మెగా ఫ్యామిలీకి చెందిన వారితో ప్రారంభించాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు.

అక్కినేని క్యాలెండర్ ఆవిష్కరణ



అక్కినేని క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జాతీయ అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో సీనినటులు అక్కినేని నాగేశ్వరరావు, అక్కినేని నాగార్జున చిత్రపటంతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం రాత్రి జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అభిమాన సంఘాల జాతీయ ప్రధాన కార్యదర్శి జోగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నట, గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ అక్కినేని చిత్రాల షూటింగ్‌లు రాజమహేంద్రవరంలో జరగడంలో తాను కీలక పాత్ర పోషించడం, అక్కినేనితో నటించడం, తన ఆర్కెస్ట్రా తరఫున ఆయనను సత్కరించడం తన అదృష్టమన్నారు. యరమ్రోతు ధర్మరాజు, ఏఎస్ ఆనంద్, శెట్టి, ముద్రగడ ఏసుబాబు, డీఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వోదయ మండల్ సేవలను విస్తరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ హుస్సేన్

సీటీఆర్ఐ: రాష్ట్రంలో సర్వోదయ మండల్ సేవా కార్యక్రమాల పునరుద్ధరణలో భాగంగా అన్ని జిల్లాలకు కార్యనిర్వాహక కమిటీలను నియమిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంబాబు అన్నారు. లాలాచెరువులోని వీనస్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మహ్మద్ హుస్సేన్ ఫరీద్ షేక్ పర్యవేక్షణలో జిల్లా సర్వోదయ మండల్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆచార్య వినోభాబావే భూదాన్ మూవ్‌మెంట్ క్యాలెండర్, సర్వోదయ మండల్ దిక్సూచిని ఆవిష్కరించారు. ప్రజల్లో దేశభక్తిని పెంచడానికి, స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడానికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా పాతాళ వీరబాబు, ప్రతినిధిగా కొక్కిపాటు పున్నయ్య, ఉపాధ్యక్షురాలిగా వేమగిరి నిర్మలారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రైజ్ రవితేజ, కోశాధికారిగా గండి రవికుమార్, సహాయ కార్యదర్శిగా బొడుపుల లీలావతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కలపల శేషయ్య, పౌర సంబంధాల అధికారిగా కొల్లూరి కిషోర్ రాజు, కార్యవర్గ సభ్యులుగా గంధం విజయ్ జాకబ్, బలే మోషే, కండెల్లి శేఖర్ నియమితులయ్యారు. వీరికి రాష్ట్ర నాయకులు ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ఉద్యోగం కోసం వెళ్లిన యువకుడి అదృశ్యం



రేలంగి దేదీప్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగం కోసం వైజాగ్‌కు వెళ్లిన తన కుమారుడు ఇప్పటివరకు తిరిగిరాలేదని హుకుంపేట గ్రామానికి చెందిన రేలంగి శ్రీనివాసరావు మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుకుంపేటకు చెందిన 22 ఏళ్ల రేలంగి దేదీప్ బీటెక్ పూర్తి చేశాడు. గత నెల 20న ఉద్యోగం చూసుకుంటానని విశాఖపట్నం వెళ్లాడు. అయితే కొద్ది రోజులుగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూజిక్ కోర్సులలో శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి మ్యూజిక్ అకాడమీ ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 8 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎం.దుర్గాఫణికుమార్ తెలిపారు. నిరుపేద విద్యార్థులకు శాస్త్రీయ సంగీతం, భక్తి సంగీతం, లలిత, సినీ గీతాలు ప్రొఫెషనల్ సింగింగ్ కోర్సులు, కీ బోర్డు ప్లేయింగు విత్ కర్నాటిక వెస్ట్రన్‌తో శిక్షణ ఇస్తామన్నారు. ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం అకాడమీ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి కలవారు 98491 98900 నంబర్‌కు ఫోన్ చేసి, రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

అవినీతికి చిరునామాగా ఎమ్మెల్యే బత్తుల

- నాలుగు నెలల సమయం ఇస్తున్నా
- ఆ తర్వాత నుంచి రోజూ అవినీతిని ఎండగడతా
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం



కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ఎన్నికల ముందు ఎంతో చేస్తానని హామీ ఇచ్చిన బత్తుల బలరామకృష్ణ.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అక్రమార్జనకు పాల్పడుతూ, థర్డ్ గ్రేడ్ వ్యక్తిలా మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ అవినీతి, అక్రమ దందాలు, దోపిడీకి చిరునామాగా ఎమ్మెల్యే బత్తుల నిలిచారన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రెస్‌మీట్‌లో తాను బత్తుల అవినీతిపై మాట్లాడానని, దానికి కౌంటర్‌గా తనపై అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. వాడు, వీడు అని సంభోదిస్తూ, బూతులు మాట్లాడటంతో ఆయన థర్డ్ గ్రేడ్ వ్యక్తిత్వం బయటపడిందన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటమి సహజమనీ, గెలుపు కోసం మాత్రమే చూసేవాడు అవకాశవాద రాజకీయ నాయకుడన్నారు. ఓడినా తాను ప్రజల మనిషినే అన్నారు.

అక్రమ పొత్తులతో గెలుపు

జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ దేశ ఎన్నికల్లో రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే ఓటమి తప్పలేదన్నారు. అక్రమ పొత్తులు, అవకాశవాద రాజకీయాల్లో బత్తుల ఆరితేరారన్నారు. వైఎస్సార్ సీపీలో ఉండగానే గాదరాడలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీతో పెట్టుకుని, ఆయన భార్య వెంకటలక్ష్మి గెలిచేలా, మరొకటి టీడీపీ ఎంపీటీసీని గెలిపించేలా అక్రమ పొత్తు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సొంత పార్టీలోనే కోవర్టుగా వ్యవహరించారన్నారు. తనకు కోనసీమలో 350 ఎకరాల భూమి, బెంగళూరులో లిక్కర్ వ్యాపారం ఉందంటూ మాట్లాడుతున్న బత్తులకు సవాల్ విసిరారు. ఎంపీటీసీ పదవిని కాపాడుకునేందుకు స్టే తెచ్చుకున్న బత్తుల రాజీనామా చేసి, పోటీకి దిగితే సాధారణ కార్యకర్తను పోటీకి పెట్టి గెలిపిస్తాననని హెచ్చరించారు. బత్తుల లేకపోవడంతో వైఎస్సార్ సీపీ కోవర్టులు లేని స్వచ్ఛమైన పార్టీగా ఉందన్నారు.

ప్రతి పనికీ వసూళ్లు

నియోజకవర్గంలో రూ.1,773 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు తెచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల పేరిట రూ.1,377 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, 20 వేల ఇళ్ల పట్టాలను పేదలకు అందజేసిన స్థాయి తనదని జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని లిక్కర్ షాపులు కూటమికే దక్కాయని, వాటి నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్న ఘనత బత్తులకే దక్కిందన్నారు. తహసీల్దార్, కానిస్టేబుల్ నుంచి సీఐ వరకూ ప్రతి పోస్టుకు డబ్బులు వసూలు చేస్తున్న ఘనత కూడా ఆయనదేనని ఎద్దేవా చేశారు.

ఆ స్థాయి నాకు లేదు

రాజా మాట్లాడుతూ ఉద్యోగాలిస్తానని చెప్పి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు కాజేసిన స్థాయి తనది కాదని, ఎన్ఆర్ఈజీఎస్‌లో నామినేటెడ్, కాంట్రాక్టు వర్కుల్లో పర్సెంటేజీలు వసూలు చేసే స్థాయి తనది కాదని, విజయవాడ బాటా షోరూంలో దొంగతనానికి పాల్పడిన స్థాయి తనది కాదని, కూతురికి సారె పంపి దాన్ని అడ్వర్టైజ్‌మెంట్ చేసుకున్న స్థాయి తనది కాదని, సీతానగరం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాతో అక్రమార్జనకు పాల్పడుతున్న స్థాయి తనది కాదని తెలిపారు. ఆయనకు నాలుగు నెలల పాటు సమయం ఇస్తున్నానని, ఆ తర్వాత నుంచి అవినీతి, అక్రమాలను ఎండగడతానన్నారు. బత్తులకు విశ్రాంతి, మనశ్శాంతి ఉండదని, అందుకే ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ నాయకులు నక్కా రాంబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి, కంటే వినయ్ తేజ, బొరుసు బద్రి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: గేమ్ ఛేంజర్
సూర్య ప్యాలెస్	: డాకు మహరాజ్
స్వామి	: గేమ్ ఛేంజర్
శివజ్యోతి	: సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	: గేమ్ ఛేంజర్
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: గేమ్ ఛేంజర్
మేనక	: సంక్రాంతికి వస్తున్నాం
రంభ	: డాకూ మహరాజ్
కుమారి	: డాకు మహరాజ్
అప్సర	: డాకు మహరాజ్
అశోక	: డాకు మహరాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్, డాకు మహరాజ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డాకు మహరాజ్, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్